కోటగిరి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో..
వీక్షించండి చానల్
NS99 CHANNEL
దగా స్థానంలో నిగా వేసే చానల్

దగా స్థానంలో నిఘా వేసే జాతీయ దిన పత్రిక

# నీలగిరి శంఖారావమ్

సమగ్ర సమాచార దర్శిని — తెలుగు జాతీయ దినపత్రిక

నల్లగొండ | సంపుటి :05 | సంచిక :117 | ఎడిటర్ : కోటగిరి చంద్రశేఖర్ | శనివారం 22-08-2026 | పేజీలు : 4 | వెల : రూ. 3/-

## చిన్నారెడ్డిపై చర్యలు తీసుకోవాలని కోరిన ఎమ్మెల్యే



న్యూఢిల్లీ, తెలంగాణ కాంగ్రెస్‌లో రగులుతున్న వనపర్తి అంతర్గత వివాదం ఢిల్లీకి చేరింది. వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి కాంగ్రెస్ సీనియర్ నేత, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జి. చిన్నారెడ్డిపై ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు ఫిర్యాదు చేశారు. చిన్నారెడ్డి పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని ఆరోపిస్తూ, ఆయనపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ఢిల్లీలో తన అనుచరులతో కలిసి ఖర్గేను కలిసిన మేఘారెడ్డి.. చిన్నారెడ్డి చేసిన వ్యాఖ్యలకు సంబంధించిన వీడియోలు, వాయిస్ రికార్డులు, మీడియా క్లిప్పింగులను అందజేసినట్లు తెలిపారు. పార్టీ గీత దాటి మాట్లాడుతున్న నేతల వ్యవహారాన్ని అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు.

'చిన్నారెడ్డిని పార్టీ నుంచి సస్పెండ్ చేయాలి'

ఖర్గేను కలిసిన అనంతరం మేఘారెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడుతున్న చిన్నారెడ్డిపై చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు. "పార్టీ ఇచ్చిన అవకాశాలను ఉపయోగించుకుని ఎదిగిన నేతలు తిరిగి అదే పార్టీపై ఆరోపణలు చేయడం సరికాదు. చిన్నారెడ్డి వ్యాఖ్యలు పార్టీ ప్రతిష్ఠకు నష్టం కలిగించేలా ఉన్నాయి. ఆయనపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలి" అని మేఘారెడ్డి పేర్కొన్నారు. కాంగ్రెస్ టికెట్ వ్యవహారంపై చిన్నారెడ్డి చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ.. పార్టీ ఎనిమిది సార్లు ఆయనకు బీ ఫామ్ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. "ఎనిమిదిసార్లు కాంగ్రెస్ పార్టీ నుంచి అవకాశం పొందినప్పుడు కూడా డబ్బులు ఇచ్చి టికెట్లు తీసుకున్నారా?" అంటూ చిన్నారెడ్డిని ప్రశ్నించారు.

'బీఆర్ఎస్‌తో కలిసి పనిచేస్తున్నారు'

చిన్నారెడ్డి వనపర్తిలో బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి పనిచేస్తున్నారని మేఘారెడ్డి ఆరోపించారు. మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డితో కలిసి రాజకీయంగా వ్యవహరిస్తున్నారని, దీనికి సంబంధించిన ఆధారాలను కూడా ఖర్గేకు అందజేశానని తెలిపారు. "నియోజకవర్గంలో నన్ను లక్ష్యంగా చేసుకుని జరుగుతున్న రాజకీయ పరిణామాలను అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లాను. పార్టీకి నష్టం కలిగించే విధంగా వ్యవహరిస్తున్న వారిపై చర్యలు తప్పనిసరి" అని మేఘారెడ్డి అన్నారు. అలాగే కాంగ్రెస్‌లో క్రమశిక్షణకు విరుద్ధంగా మాట్లాడుతున్న వారందరిపైనా చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు. మంత్రి కొండా సురేఖ వ్యవహారంపై కొందరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు చేసిన వ్యాఖ్యలతో తాను ఏకీభవిస్తున్నానని, పార్టీ నియమాలను అందరూ పాటించాల్సిందేనని స్పష్టం చేశారు.

కేసీ వేణుగోపాల్, మీనాక్షి నటరాజన్‌తో భేటీ

ఖర్గేకు ఫిర్యాదు చేసిన అనంతరం కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌ను కూడా కలవనున్నట్లు మేఘారెడ్డి తెలిపారు. వనపర్తి నియోజకవర్గంలో నెలకొన్న పరిస్థితులు, చిన్నారెడ్డి వ్యాఖ్యలు, పార్టీపై వాటి ప్రభావాన్ని వారికి వివరించనున్నట్లు చెప్పారు.

టికెట్ వివాదంతో మొదలైన విభేదాలు

వనపర్తి కాంగ్రెస్‌లో మేఘారెడ్డి, చిన్నారెడ్డి మధ్య వివాదం ఇటీవల బహిరంగంగా మారింది. 2023 ఎన్నికల సమయంలో పార్టీ టికెట్ కేటాయింపు అంశంపై చిన్నారెడ్డి చేసిన వ్యాఖ్యలు వివాదానికి కారణమయ్యాయి. మేఘారెడ్డి తనకు డబ్బులు ఇచ్చి టికెట్ వచ్చిందనే ఆరోపణలను ఖండిస్తూ, పార్టీ నాయకత్వాన్ని అవమానించేలా వ్యాఖ్యలు చేయడం సరికాదని అన్నారు. మరోవైపు చిన్నారెడ్డి మాత్రం తనకు జరిగిన అన్యాయాన్ని ప్రశ్నిస్తున్నానని, పార్టీని వీడే ఉద్దేశం లేదని స్పష్టం చేస్తున్నారు.

అధిష్ఠానం నిర్ణయంపైనే ఉత్కంఠ

వనపర్తి వివాదం ఇప్పుడు రాష్ట్ర స్థాయిని దాటి ఢిల్లీకి చేరడంతో కాంగ్రెస్ అధిష్ఠానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందన్నది ఆసక్తిగా మారింది. ఒకవైపు మేఘారెడ్డి చర్యలు కోరుతుండగా.. మరోవైపు చిన్నారెడ్డి తన వాదనను వినిపిస్తున్నారు. ఇద్దరు నేతలు సీనియర్ రాజకీయ కుటుంబాలకు చెందిన వారే కావడంతో ఈ వివాదానికి కాంగ్రెస్ నాయకత్వం ఎలా ముగింపు పలుకుతుందన్నది తెలంగాణ రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

## కొండా సురేఖ భాషే కాంగ్రెస్ కు తలనొప్పి



హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయాలను వ్యతిరేకిస్తున్న వాళ్లకి కాంగ్రెస్ పార్టీలో ఉండే అర్హత లేదని కాంగ్రెస్ ఎంఎల్ఏ వేముల వీరేశం మండిపడ్డారు. సిఎం రేవంత్ రెడ్డిపై కొండా సుష్మితా చేసిన వ్యాఖ్యలకు వీరేశం రీకౌంటర్ ఇచ్చారు. మంత్రి కొండా సురేఖకు నోటీసులు ఇస్తే తన బిడ్డ మాటలకు తనకు సంబంధం లేదని చెప్పడం దారుణమన్నారు. తల్లికి సంబంధం లేకపోతే ఆమె మాటలను కొండా సురేఖ ఎందుకు ఖండించలేదని ప్రశ్నించారు. కొండా సురేఖ మాట్లాడుతున్న తప్పుడు భాషకు కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి మూల్యం చెల్లిస్తున్నారని తెలియజేశారు. సురేఖ మాత్రం మంత్రి పదవిని ఎంజాయ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీని ఇబ్బంది పెడుతున్నారని వేముల ధ్వజమెత్తారు. సమంత అంశంలో కొండా సురేఖ మాట్లాడింది తప్పు అని చురకలంటించారు. ఆమె భాష ఎప్పుడూ పార్టీకి నష్టం కలిగించే విధంగానే ఉందని, సమంత అంశంలో సురేఖ చేసిన వ్యాఖ్యలు కూడా కాంగ్రెస్ పార్టీకి తలనొప్పిగా మారాయని ఆమెపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ సభ్యులు కానీ, అనామకులైన కొండా సుష్మిత కాంగ్రెస్ ఎమ్మెల్యేలను పట్టుకొని అడ్డగోలుగా మాట్లాడడం సరికాదన్నారు. రాజకీయ విలువలు కాపాడాలని సురేఖను వేముల కోరారు.

## సిఎంపై ఎవరు విమర్శలు చేసినా ఊరుకోం : బీర్ల ఐలయ్య

హైదరాబాద్: సిఎం రేవంత్ రెడ్డి పై విపక్ష నేతలు విమర్శలు చేస్తే అర్థం చేసుకోవచ్చునని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య తెలిపారు. కొండా సుస్మిత వ్యాఖ్యలను ఖండిస్తున్నామని, కానీ సొంత పార్టీ నేతలే ప్రతిపక్షంలా మాట్లాడితే ఎలా? అని ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సుస్మిత వ్యాఖ్యలపై మంత్రి కొండా సురేఖ స్పందించాలని కోరారు. ముఖ్యమంత్రికి తామంతా అండగా ఉన్నామని హామీ ఇచ్చారు. సిఎంపై ఎవరు విమర్శలు చేసినా ఊరుకోమని, ఏదైనా ఉంటే పిసిసికి లేదా సిఎం కు నేరుగా ఫిర్యాదు చేయాలని సూచించారు. అంతర్గత విషయాలను బయటకు చెప్పడం సరికాదని బీర్ల ఐలయ్య హెచ్చరించారు.



## నీట్ తర్వాత వైద్య విద్యలో ఇబ్బందులపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడికి వినతి

హైదరాబాద్,నీట్ ద్వారా ఎంబీబీఎస్ కోర్సుల్లో చేరిన విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై వారి తల్లిదండ్రుల ప్రతినిధి బృందం బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్‌రావును కలిసింది. హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో వైద్య విద్యార్థుల ఫీజులు, ఇంటర్న్‌షిప్, కళాశాలల నిబంధనల అమలు వంటి అంశాలను తల్లిదండ్రులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. తమ సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం, సంబంధిత అధికారులపై ఒత్తిడి తీసుకురావాలని వారు కోరారు.

ఇంటర్న్‌షిప్‌కు కూడా ఫీజు డిమాండ్?

తల్లిదండ్రులు ప్రధానంగా కొన్ని ప్రైవేటు వైద్య కళాశాలల తీరుపై ఫిర్యాదు చేశారు. టీఏఎఫ్ఆర్‌సీ (తెలంగాణ అడ్మిషన్స్ అండ్ ఫీ రెగ్యులేటరీ కమిటీ), ఎన్ఎంసీ (నేషనల్ మెడికల్ కమిషన్) నిబంధనల ప్రకారం నాలుగున్నరేళ్ల ఎంబీబీఎస్ కోర్సుకే ఫీజు వసూలు చేయాల్సి ఉండగా.. కొన్ని కళాశాలలు ఏడాది ఇంటర్న్‌షిప్ కాలానికి కూడా ఫీజులు అడుగుతున్నాయని ఆరోపించారు. ఈ విధానం విద్యార్థులపై అదనపు ఆర్థిక భారం మోపుతోందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు.

విద్యార్థులకు ఇబ్బందులు పెడుతున్నారంటూ ఫిర్యాదు

కొన్ని కళాశాలల్లో విద్యార్థులకు తరగతులకు హాజరు, బయోమెట్రిక్ అటెండెన్స్, హాల్‌టికెట్ల విషయంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తల్లిదండ్రులు తెలిపారు. అంతేకాకుండా ఇంటర్న్‌షిప్ సమయంలో ఇవ్వాల్సిన స్టైపెండ్‌లను నిలిపివేయడం లేదా తిరిగి వసూలు చేస్తున్నారనే ఫిర్యాదులను కూడా



రామచందర్‌రావు దృష్టికి తీసుకెళ్లారు. వైద్య విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకోవాలని వారు కోరారు.

విద్యార్థుల తరఫున పోరాడుతాం: రామచందర్‌రావు

తల్లిదండ్రుల సమస్యలను విన్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు.. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి తమ పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. టీఏఎఫ్ఆర్‌సీ, ఎన్ఎంసీ మార్గదర్శకాలు పూర్తిస్థాయిలో అమలయ్యే వరకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామని ఆయన తెలిపారు. వైద్య విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు అన్యాయం జరగకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తామని చెప్పారు. నీట్ ద్వారా వైద్య విద్యలో ప్రవేశం పొందిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఎదుర్కొంటున్న సమస్యలపై బీజేపీ పోరాటం కొనసాగిస్తుందని రామచందర్‌రావు స్పష్టం చేశారు.

## రేవంతుకు బ్రేకులు వేసింది ఎవరు ?

హైదరాబాద్,పది రోజుల బ్రిటన్, అమెరికా పర్యటనకు బయలుదేరిన తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఈ నెల 23న లండన్ నుండి తిరిగి భారత్ కు రానున్నారు. ఆయన అమెరికా పర్యటనకు కేంద్ర ప్రభుత్వం నిరాకరించిందని, ఈ మేరకు రాజకీయ కారణాలతో అనుమతులు ఇవ్వలేమని విదేశాంగ శాఖ వెల్లడించినట్లు చెబుతున్నారు.అమెరికా పర్యటనలో బోస్టన్, న్యూయార్క్ తదితర ప్రాంతాల్లో పర్యటించి హార్వర్డ్, ఎంఐటీ, నార్త్‌ఈస్టర్న్ యూనివర్సిటీ, వర్జీనియా టెక్ వంటి ప్రముఖ విద్యాసంస్థలతో ఒప్పందాలు చేసుకోవాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించిందని, రేవంత్ రెడ్డికి అనుమతి నిరాకరించిన నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం అమెరికా పర్యటన రద్దయినట్లు స్పష్టం చేశారు.ఈ నేపథ్యంలో రేవంత్ రెడ్డి స్పందిస్తూ, "ఈ పర్యటన ఉద్దేశం ఒక్కటే. కేంద్రం తీసుకొచ్చిన నూతన విద్యా విధానంలో భాగంగా ప్రపంచంలోని ప్రఖ్యాత విద్యా సంస్థలను భారత్‌కు, తెలంగాణకు, హైదరాబాద్‌కు తీసుకురావడం. అత్యుత్తమ ఐవీ లీగ్ విశ్వవిద్యాలయాలను, ప్రపంచంలోని అగ్రశ్రేణి విద్యాసంస్థల నుంచి విద్య, నైపుణ్యాలు, శిక్షణ పొందాలన్న మన యువత ఆకాంక్షలకు ఇవి సమాధానంగా నిలిచేవని, దేశ నిర్మాణం, యువత భవిష్యత్తు విషయానికి వస్తే అందరూ రాజకీయాలు, ఎన్నికలకు అతీతంగా ఆలోచించాలని నేను ఎప్పుడూ విశ్వసిస్తానని" అని పేర్కొన్నారు.మరోవైపు సీఎం పర్యటన రద్దువెనక వివిధ రకాల ఊహాగానాలు వినిపిస్తున్నాయి. కొండా సురేఖ కూతురు కొండా సుష్మిత వ్యాఖ్యల నేపథ్యంతో పాటు రాష్ట్రంలో శక్తి పథకం విషయంలో పాలిటెక్నిక్ విద్యార్థుల ఆందోళనలు తీవ్రతరం కావడం, మరోవైపు 22ఏ కింద నిషేధిత భూముల విషయంలో బాధితుల తీవ్ర ఆందోళనల నేపథ్యంలో పార్టీ అధిష్టానం రేవంత్ రెడ్డి అమెరికా పర్యటనకు వెళ్లకుండా తిరిగి వచ్చి రాష్ట్రంలో పరిస్థితులు చక్కదిద్దాలని ఆదేశించినట్లు ప్రచారం జరుగుతున్నది.అదే సమయంలో రాష్ట్రంలో వేగంగా మారుతున్న



సమీకరణాల నేపథ్యంలో అమెరికా పర్యటన రద్దు చేసుకుని రాష్ట్రానికి రావాలని రేవంత్ రెడ్డి సన్నిహితులే సూచించిన నేపథ్యంలోనే అమెరికాకు అధికారులను పంపించి తాను తిరిగి వస్తున్నట్లు కూడా ఊహాగానాలు వినిపిస్తున్నాయి. వాస్తవంగా వచ్చే నెల 10 వరకు బ్రిటన్, అమెరికాతో పాటు జర్మనీ, చైనాలను సందర్శించాల్సి ఉంది. కానీ అన్ని రోజుల పర్యటన మరీ సుధీర్ఘంగా అవుతుందని దానిని కుదించి కేవలం బ్రిటన్, అమెరికా పర్యటనలకు మాత్రమే పరిమితం అయ్యారు. తాజా పరిణామాలతో అమెరికా పర్యటన కూడా రద్దవడం గమనార్హం.

### ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ ముందు మానవతారాయ్

హైదరాబాద్,ఫోన్ ట్యాపింగ్ కేసులో కాంగ్రెస్ నేత మానవతారాయ్ సిట్ ముందు విచారణకు హాజరయ్యారు. బాధితుడిగా సిట్ అధికారులు ఇచ్చిన నోటీసుల మేరకు బషీర్బాగ్లోని సీసీఎస్ కార్యాలయానికి చేరుకున్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసుకు సంబంధించి మానవతారాయ్ నుంచి సిట్ అధికారులు వివరాలు, వాంగ్మూలం నమోదు చేసారు.

## హైకోర్టులో ఎమ్మెల్యేల ఫిరాయింపు కేసు విచారణ.. సెప్టెంబర్ 16న తీర్పు

హైదరాబాద్, ఆగస్టు 21: తెలంగాణలో ఎమ్మెల్యేల ఫిరాయింపుల వ్యవహారంపై దాఖలైన పిటిషన్లపై హైకోర్టులో విచారణ జరిగింది. ఎమ్మెల్యేల అనర్హతపై హైకోర్టులో ఇరుపక్షాల వాదనలు ముగిశాయి. దీంతో సెప్టెంబర్ 16న తీర్పును వెల్లడించనున్నట్లు న్యాయస్థానం తెలిపింది. పార్టీ మారిన పది మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ తరఫు న్యాయవాదులు హైకోర్టులో వాదనలు వినిపించారు. కాంగ్రెస్‌కు అనుకూలంగా ఆయా ఎమ్మెల్యేలు ప్రచారం చేసిన వీడియోలను న్యాయస్థానానికి సమర్పించారు. అభివృద్ధి కోసం మాత్రమే ప్రభుత్వంతో కలిసి పనిచేస్తున్నామని ఫిరాయింపు ఎమ్మెల్యేలు అంటున్నారని బీఆర్ఎస్ తరఫు న్యాయవాది గండ్ర మోహన్ రావు కోర్టుకు తెలియజేశారు. ఏఐసీసీ అధికారిక కార్యక్రమాల్లో ఫిరాయింపు ఎమ్మెల్యేలు పాల్గొన్నారని, వీరి వీడియోలుఆాదీచీ ఆంధ్రజ్యోతిలో ప్రసారం అయ్యాయని తెలిపారు.ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకుని.. జాతీయ జెండాగా చెబుతున్నారని, జాతీయ జెండాలో అశోక చక్ర ఉంటుందని గండ్ర మోహన్ రావు.. కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే దానం నాగేందర్.. బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా ఎన్నికై, ఎమ్మెల్యే పదవిలో కొనసాగుతూనే కాంగ్రెస్ పార్టీ తరఫున ఎంపీగా పోటీ చేశారని కోర్టుకు



వివరించారు. పార్టీ సభ్యత్వం లేని వ్యక్తులకు ఎన్నికల్లో టికెట్ ఇవ్వడం సాధ్యం కాదని అన్నారు. ప్రధాన పత్రికలు, టీవీ ఛానళ్లలో ప్రసారమైన వార్తా కథనాలు, వీడియోలను కూడా బీఆర్ఎస్ తరఫు న్యాయవాది గండ్ర మోహన్ రావు న్యాయస్థానం ముందు ఉంచారు. ఇరుపక్షాల వాదనలు పూర్తవడంతో సెప్టెంబర్ 16న తీర్పును వెల్లడించనున్నట్లు హైకోర్టు పేర్కొంది.

## స్పేస్ స్టార్టప్ సంస్థల ప్రతినిధులతో ప్రధాని భేటీ..

న్యూఢిల్లీ,భారత్‌ను ప్రపంచంలోనే ప్రముఖ అంతరిక్ష సాంకేతిక కేంద్రంగా (స్పేస్ హబ్) తీర్చిదిద్దే దిశగా వేగంగా అడుగులు వేయాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. దేశంలోని ప్రముఖ స్పేస్ స్టార్టప్ సంస్థల సీఈఓలు, వ్యవస్థాపకులతో శుక్రవారం న్యూఢిల్లీలో సమావేశమైన ప్రధాని.. అంతరిక్ష రంగంలో యువ పారిశ్రామికవేత్తలు చేస్తున్న కృషిని అభినందించారు. భారత అంతరిక్ష రంగంలో ప్రైవేటు భాగస్వామ్యం పెరగడం, కొత్త ఆవిష్కరణలు రావడం దేశానికి కీలక పరిణామమని ప్రధాని పేర్కొన్నారు. ప్రపంచం అంతరిక్ష రంగం గురించి ఆలోచించినప్పుడు భారత్ వైపు చూసేలా బలమైన వ్యవస్థను నిర్మించాలని సూచించారు.

20 స్పేస్ స్టార్టప్‌ల ప్రతినిధులతో భేటీ

ఈ సమావేశంలో దేశంలోని 20 ప్రముఖ అంతరిక్ష స్టార్టప్ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. Skyroot Aerospace, Agnikul Cosmos, Pixxel, Dhruva Space వంటి సంస్థల ప్రతినిధులు తమ ఆలోచనలు, భవిష్యత్ ప్రణాళికలను ప్రధానికి వివరించారు. యువ శాస్త్రవేత్తలు, పారిశ్రామికవేత్తలు అంతరిక్ష రంగంలో కొత్త మార్గాలను అన్వేషించడం అభినందనీయమని మోదీ అన్నారు.

స్టార్టప్‌లకు ప్రభుత్వ సహకారం

అంతరిక్ష రంగంలో చేపట్టిన సంస్కరణలు మంచి ఫలితాలు ఇస్తున్నాయని ప్రధాని తెలిపారు. ప్రైవేటు సంస్థలు, స్టార్టప్‌లకు కేంద్ర ప్రభుత్వం అవసరమైన సహకారం అందిస్తుందని భరోసా ఇచ్చారు. అంతరిక్ష రంగాన్ని కేవలం రాకెట్లు, ఉపగ్రహాలకే పరిమితం చేయకుండా.. ప్రజల జీవితాల్లో మార్పు తీసుకొచ్చే సాంకేతికతగా అభివృద్ధి చేయాలని సూచించారు.

వ్యవసాయం నుంచి పర్యావరణం వరకు..

అంతరిక్ష సాంకేతికతను ఇతర రంగాలతో అనుసంధానం చేయాల్సిన అవసరం ఉందని ప్రధాని పేర్కొన్నారు. ఉపగ్రహాల ద్వారా లభించే సమాచారాన్ని వ్యవసాయం, వాతావరణ అంచనాలు, పర్యావరణ పరిరక్షణ, విపత్తుల నిర్వహణ



